శైవ క్షేత్రాలకు ఆర్టీసీ ప్రత్యేక బస్సులు: ఆర్ఎం రాజు

వివరాలు వెల్లడిస్తున్న ఆర్టీసీ ఆర్ఎం బీ రాజు

తెలంగాణచౌక్, ఫిబ్రవరి15: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని భక్తుల సౌకర్యం కోసం ఉమ్మడి జిల్లాలోని శైవ క్షేత్రాలకు ఈనెల 25 నుంచి 27 వరకు ప్రత్యేక బస్సులు నడిపిస్తున్నామని ఆర్టీసీ కరీంనగర్ ఆర్ఎం బీ రాజు తెలిపారు. శనివారం ఆయన తన కార్యాలయంలో మాట్లాడుతూ, ఉమ్మడి జిల్లాలోని వేములవాడ, కాళేశ్వరం, వేలాల, దుబ్బరాజన్న, పొట్లపల్లి శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడిపించేలా ప్రణాళికలు రూపొందించామని, రద్దీని బట్టి మరిన్ని బస్సులు నడిపించనున్నట్లు వెల్లడించారు. వేములవాడ క్షేత్రానికి జోనల్ పరిధిలో అన్ని డిపోలను నుంచి 778 బస్సులు నడుపాలని నిర్ణయించామని, ఇందులో వేములవాడ తిప్పాపూర్ బస్టాండ్‌కు 443, కట్టకింద బస్టాండ్‌కు 335 బస్సులు నడుస్తాయని వివరించారు. అన్ని బస్టాండ్లలో మంచినీటి వసతి కల్పించామని, సిబ్బంది అందుబాటులో ఉంటూ ప్రయాణికులకు సేవలందిస్తారని తెలిపారు. ఆర్టీసీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బైనంబర్లుంటే రైతు భరోసా బందేనా?

కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : రైతు భరోసా జమచేయడంలో రాష్ట్ర ప్రభుత్వం అనేక కోతలు పెడుతున్నదని తెలంగాణ రైతు సంఘాల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మాడ వెంకటరెడ్డి ఆరోపించారు. శనివారం నగరంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన ఆసంఘం జిల్లాశాఖ సర్వసభ్య సమావేశంలో మాట్లాడుతూ, మూడెకరాల్లోపు రైతులందరికీ భరోసా విడుదల చేసినట్లు ప్రకటించినా, చాలా చోట్ల వేయలేదని తెలిపారు. సర్వే నంబర్లలో బైనంబర్లు ఉన్న వారికి భరోసా అందలేదని స్పష్టం చేశారు. రైతు భూమి రెండు, మూడు సర్వే నంబర్లలో ఉంటే ఒకటి లేదా రెండు నంబర్లకు మాత్రమే జమవుతున్నదని పేర్కొన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతి రైతుకు ఎకరాకు రూ.17,500 బాకీ ఉండగా, ప్రస్తుతం కేవలం రూ.6వేలు మాత్రమే జమ చేస్తూ, చేతులు దులుపుకొంటున్నదని ధ్వజమెత్తారు. ఇందులో కూడా కోతలు పెడుతూ, సాధ్యమైనంత తగ్గించే యత్నం చేయడం ప్రభుత్వ దగాకోరు తనానికి నిదర్శనమని దుయ్యబట్టారు. సమావేశంలో సంఘం నాయకులు రఘు నాయకుల రాజారెడ్డి, బండి కాశీవిశ్వనాథరెడ్డి, బొప్పరాజు మనోహరరావు, సంజీవరావు, ముత్తినేని సత్యంరావు, సాపుల రాజయ్య, బద్దిపడగ రాజయ్య, జంగపల్లి వెంకటేశం, ఎం.శ్రీనివాస్, వైద్యుల రాజశేఖర్ పాల్గొన్నారు.

బీసీ కులగణన సర్వే మరోసారి జరుపాలి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 15: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ కులగణన సర్వే మరోసారి జరుపాలని ముదిరాజ్ మహాసభ జిల్లా ఉపాధ్యక్షుడు కొలిపాక సమ్మయ్య ఒక ప్రకటనలో కోరారు. పార్టీలు పెట్టే భిక్ష బీసీలకు వద్దని, రాజ్యాంగం హక్కుగా కల్పించే రిజర్వేషన్లు కావాలని పేర్కొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ మెప్పుకోసం, పదవిని కాపాడుకునేందుకు మాత్రమే బీసీ కులగణన నిర్వహించారు తప్ప, సర్వేలో పారదర్శకత లేదని తెలిపారు. రానున్న రోజుల్లో రాష్ట్రంలో కూడా ఉన్నత వర్గాల నుంచి కన్వర్టెడ్ బీసీలు పుట్టుకొచ్చే ప్రమాదముందని అనుమానం వ్యక్తం చేశారు. అధికార, ప్రతిపక్షాల బీసీ నాయకులు ఏకతాటిపైకి వచ్చి బీసీల వాటాను సాధించుకోవాలని సమ్మయ్య సూచించారు.

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : పూర్వ వీఆర్ఏల వారసులకు ఉద్యోగాలు కల్పించాలనే డిమాండ్‌తో ఈనెల 17న నిర్వహించనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వీఆర్ఏల వారసుల ఉద్యోగాల సాధన సమితి జిల్లా నాయకుడు ఎం. రాములు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని కిసాన్‌నగర్‌లో గల ఆసంఘం జిల్లా కార్యాలయంలో చలో హైదరాబాద్ కార్యక్రమ సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ, జీవో నం.81, 82 ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 16,758 మందికి ఉద్యోగాలు కల్పించగా, మిగిలిన 3,700 పైచిలుకు మంది ఇంకా ఉద్యోగాల కోసం వేచి చూస్తున్నారని తెలిపారు. తమ బాధలు మరోసారి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే ఈనెల 17న చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టినట్లు వెల్లడించారు. జిల్లాలో వీఆర్ఏల వారసుల కుటుంబాలన్నీ ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు తరలిరావాలని కోరారు. సమావేశంలో వీఆర్ఏల వారసుల జేఏసీ ప్రతినిధులు, వీఆర్ఏల వారసులు పాల్గొన్నారు.

పది అంతర్గత మార్కుల మూల్యాంకన పరిశీలన

రామడుగు, ఫిబ్రవరి15 : పదో తరగతి విద్యార్థులకు వార్షిక పరీక్షలు సమీపిస్తుండగా, మండలంలోని పలు గ్రామాల ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల్లో శనివారం నుంచి పదో తరగతి అంతర్గత మార్కుల మూల్యాంకనాన్ని తనిఖీ బృందం లీడర్లు రంగనాథశర్మ, పద్మజ, పద్మ సభ్యులతో కలిసి పరిశీలించారు. గోపాల్‌రావుపేట ఉన్నత పాఠశాలలో తనిఖీ బృందం సభ్యులు తెలుగు, ఆంగ్లం, హిందీ, సామాన్యశాస్త్రం, సాంఘికశాస్త్ర, గణిత శాస్త్రంలో అంతర్గత మార్కుల మూల్యాంకనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి అంబటి వేణుకుమార్ మాట్లాడుతూ, పాఠశాలల్లో మూల్యాంకన పరిశీలన కోసం వచ్చే తనిఖీ బృందానికి సహకరించాలని ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కోరారు. ఇక్కడ తనిఖీ బృందం సభ్యులు దయాకర్, శ్రీనివాస్, ఇన్‌చార్జి హెచ్ఎం వనితాకుమారి, ఉపాధ్యాయులు ఉన్నారు.

సొంత ఖర్చులతో రోడ్డు నిర్మాణం

వీణవంక, ఫిబ్రవరి 15: మండలంలోని కొండపాక గ్రామానికి చెందిన కొందరు యువకులు తమ సొంత ఖర్చులతో కొండపాక నుంచి పొత్కపల్లికి మానేరు వాగుపై తాత్కాలిక రోడ్డు నిర్మించారు. ఈ మార్గం గుండా కొండపాక నుంచి పొత్కపల్లి, కాల్వశ్రీరాంపూర్, వయా పెద్దపల్లి, గోదావరిఖని, మంచిర్యాల వెళ్లే వారికి దూరభారం తగ్గుతుండడంతో మానేరువాగుపై తాత్కాలిక మట్టి రోడ్డును నిర్మించామని గ్రామ యువకులు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఆవాల అరుంధతి-గిరిబాబు, పెద్దపల్లి రాజయ్య, మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు కాసర్ల అనిల్‌కుమార్, వైస్ ప్రెసిడెంట్ దాట్ల శ్రీనివాస్, కాసర్ల వీరస్వామి, కాసర్ల సమ్మయ్య, బుచ్చయ్య, స్వామి, రాయమల్లు తదితరులు పాల్గొన్నారు.

సదరం క్యాంపుల నిలిపివేత

కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ హాస్పిటల్‌లో ఈ నెల 17, 18 తేదీల్లో జరుగనున్న సదరం క్యాంపులు నిలిపివేస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీధర్ తెలిపారు. సదరం వెబ్‌సైట్‌లో ఏర్పడిన సాంకేతిక లోపాలు సరిదిద్దుతున్న నేపథ్యంలో సోమవారం జరుగాల్సిన కంటి చూపు పరిశీలన, మంగళవారం నిర్వహించే మానసిక వైకల్య నిర్ధారణ పరీక్షలు నిలిపివేస్తున్నట్లు, శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలో తెలియజేయనున్నట్లు వెల్లడించారు.

కెనరా బ్యాంక్ (భారత ప్రభుత్వరంగ సంస్థ) Syndicate | కరీంనగర్ శాఖ 2-3-136, మెయిన్ సూపర్ మార్కెట్ పైన, 1వ అంతస్తు, కమాన్ సర్కిల్ సమీపాన, కరీంనగర్-505 001.

వాహనం వేలం అమ్మకం ప్రకటన

కెనరా బ్యాంక్ కరీంనగర్ శాఖ, కమాన్ సర్కిల్ సమీపాన, కరీంనగర్-505 001వే వేలం వేయబడు దిగువ తెలిపిన చరాస్తులను కొనుగోలు చేయుటకు ప్రజల నుండి ఆఫర్లు కోరబడుచున్నవి:

రుణగ్రహీత(లు): శ్రీ చావరియా ధరమ్ సింగ్, తండ్రి: హోట జ్జి సింగ్, ఇం.నెం. 4-5-313, వాల్మీకి నగర్, కరీంనగర్, తెలంగాణ-505 001 **(A/c No.170000875134)** నుండి **కెనరా బ్యాంక్, కరీంనగర్ శాఖకు** బకాయి **రూ. 9,15,153.93,** దానిపై బ్యాంక్ చార్జీలను రాబట్టుకొనుటకు సెక్యూర్డ్ క్రెడిటార్‌కు తాకట్టు పెట్టబడిన దిగువ వివరించిన చరాస్తులు **"ఎక్కడ ఎలా ఉన్నది" "అక్కడ అలా"** మరియు **"అక్కడ ఏమున్నదో అదే"** ప్రాతిపదికన **04-03-2025న ఉ॥ 11.00 గం. నుండి మ॥ 12.00 గం. వరకు** బహిరంగ వేలంలో విక్రయించబడుతుందని ముఖ్యంగా రుణగ్రహీత(లు) మరియు హామీదారు(లు)కు మరియు సాధారణ ప్రజలకు ఇందుమూలముగా నోటీసు ఇవ్వడమైనది. బయానాను **03-03-2025**న లేదా ఆలోగా **సా॥ 4.00 గం.**లోగా డిపాజిట్ చేయవలెను.

చరాస్తి ఐటంల వివరాలు మరియు పూర్తి వివరణ

చరాస్తులు (ఐటంల వివరణ)	రిజర్వు ధర	బయానా మొత్తం
EICHER 380 USJ TRACTOR BSIIIA Regn No : TS 02 UD 1145	రూ.6,00,000/-	రూ.60,000/-

1) ఆఫర్ లెటర్ మరియు కెనరా బ్యాంక్ పేరున DD/RTGS /NEFTని రిజర్వు ధరలో 10% బయానా (గెలుపొందిన బిడ్డరకు వాపసు చేయబడుతుంది)తో పాటు సీల్డు కొటేషన్లు కోరబడుతున్నవి. **2)** వేలం తేది & సమయం: శాఖ ఆవరణలో **04-03-2025 న ఉ॥ 11.00 గం.నుండి మ॥ 12.00 గం.వరకు. 3)** కొటేషన్ల దాఖలు కొరకు చివరి తేది: **03-03-2025న సా॥ 4.00 గం.** వరకు. **4)** గెలుపొందిన బిడ్డర్లు అమ్మకం ధరలో 25% (ఇది వరకే చెల్లించిన బయానా కలుపుకుని) అతని / ఆమె పేరున అమ్మకం కొట్టివేయబడిన వెంటనే మరియు అమ్మకం నిర్ధారణ తేదీ నుండి 15 రోజులలో మిగిలిన మొత్తాన్ని చెల్లించాలి. అమ్మకం ధర చెల్లించుటలో గెలుపొందిన బిడ్డరు విఫలమైతే, అతని డిపాజిట్ చేసిన మొత్తం జప్తు చేయబడుతుంది. **5)** సీల్డు కొటేషన్ల దాఖలుకు ముందు వాహనం తనఖీ చేసుకొనుట మరియు తమకు తాము సంతృప్తి చెందుట కాగోరు బిడ్డర్ల బాధ్యత. **6)** కాగోరు బిడ్డర్లు బిడ్ దరఖాస్తులతో సహా KYC డాక్యుమెంట్లు దాఖలు చేయాలి. **7)** ఎటువంటి కారణం తెలియజేయకుండా వేలం వాయిదా వేయుట / రద్దు చేయుట లేదా నియమ నిబంధనలు మార్పుటకు ఆధీకృత అధికారి హక్కును కలిగి ఉన్నారు. **గమనిక:** కాగోరు బిడ్డరు గ్యారేజి చార్జీలు, పన్నులు, మరమ్మతు చార్జీలు వంటి వాహనం బకాయిలను భరించాలి. తదుపరి వివరాల కొరకు సంప్రదించండి, మేనేజర్: **7382932191.**

తేది: 15-02-2025, ప్రదేశం: వరంగల్. సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్.

పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు కల్పించాలి

- ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలి
- కలెక్టర్ పమేలాసత్పతి

కలెక్టరేట్/గంగాధర, ఫిబ్రవరి 15 : ఉత్తర తెలంగాణ జిల్లాల పట్టభద్రులు, శాసనమండలి ఎన్నికల పోలింగ్ ఈనెల 27న జరుగనున్న నేపథ్యంలో, పోలింగ్ కేంద్రాల్లో పూర్తి సౌకర్యాలు కల్పించాలని కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశించారు. జిల్లాకేంద్రంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, వాణినికేతన్ డిగ్రీ కళాశాల, ప్రభుత్వ ధన్గర్‌వాడీ ఉన్నత పాఠశాల, గంగాధర మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలతో పాటు జిల్లాలోని పలు పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను శనివారం సందర్శించారు. పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేయబోయే గదులు, అక్కడ గల సౌకర్యాలు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ సంఖ్యను ఓటర్లకు కనిపించేలా ప్రదర్శించాలని సూచించారు. అన్ని కేంద్రాల్లో ధారాళంగా వెలుతురు ఉండేలా చూడాలని, ప్రతి

గంగాధర మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

ఓటరు ప్రశాంతమైన వాతావరణంలో స్వేచ్ఛగా ఓటు వేసేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్లను ఆదేశించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ ప్రపుల్ దేశాయ్, ఆర్డీవో కె.మహేశ్వర్, తహసీల్దార్లు నరేందర్, అనుపమ, ఎంపీడీవో రాము, ఎంపీవో జనార్దన్‌రెడ్డి, ఆర్ఐలు శ్రీనివాస్, రాజుతో పాటు రెవెన్యూ, పంచాయతీ రాజ్ సిబ్బంది ఉన్నారు.

వెబ్‌సైట్‌లో ఎమ్మెల్సీ ఓటరు జాబితా

కలెక్టరేట్, ఫిబ్రవరి 15 : ఉత్తరతెలంగాణ జిల్లాల పట్టభద్రులు, ఉపాధ్యాయుల శాసన మండలి ఓటర్ల జాబితా ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో పొందుపర్చినట్లు జిల్లా ఎన్నికల అధికారి పమేలా సత్పతి తెలిపారు. ఓటరు జాబితాలో తమ పేర్లు, సీరియల్ నంబర్, పోలింగ్ కేంద్రం పేరు, తదితర వివరాలు తెలుసుకునేందుకు వీలుగా వెబ్‌సైట్‌లో ఎన్నికల సంఘం వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్లు వెల్లడించారు. http;\\ceotserms2.telangana. gov.in వెబ్‌సైట్‌లో ఓటర్లు తమ వివరాలు తెలుసుకోవచ్చని శనివారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు.

తాగునీటి సరఫరాలో ఇబ్బందులు రానివ్వొద్దు

- నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్

కార్పొరేషన్, ఫిబ్రవరి 15: వేసవికాలంలో నగర ప్రజలకు తాగునీటి సమస్యలు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలని నగర కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ అధికారులను ఆదేశించారు. శనివారం 31వ డివిజన్‌లో పర్యటించారు. పారిశుధ్య పనులు, మంచినీటి సరఫరా తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, నగరంలో ప్రణాళికలు సిద్ధం చేసుకొని తాగునీటి సరఫరా సమస్యలు పరిష్కరించాలన్నారు. నగర వ్యాప్తంగా రిజర్వాయర్ల వారీగా ఎక్కడ లీకేజీలు ఉన్నా గుర్తించి అరికట్టాలన్నారు. లోలెవల్, హైలెవల్‌లో మంచినీటి సరఫరాలో ప్రెషర్ సమస్యలు రాకుండా చూడాలన్నారు.

డంప్ యార్డ్‌కు వెళ్లే చెత్తను తగ్గించాలి

డంపుయార్డుకు వెళ్లే చెత్త తగ్గించాలని, చెత్త ఉత్పత్తి అయ్యేచోటనే డిస్పోజ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ ఆదేశించారు. కరీంనగర్ నగరపాలక సంస్థ సమావేశ మందిరంలో 31, 7వ డివిజన్లకు చెందిన వార్డు ఆఫీసర్లు, పారిశుధ్య జవానులు, స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు, సమైక్య సంఘాల లీడర్లు, ఆర్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్

31వ డివిజన్‌లో పారిశుధ్యం, నీటి సరఫరాకు సంబంధించి సూచనలిస్తున్న కమిషనర్

మాట్లాడుతూ.. సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్‌లో భాగంగా రెండు డివిజన్లలో ఉత్పత్తి అయిన చెత్తను డంపుయార్డుకు కాకుండా రిసోర్స్ పార్కులోని ట్రిపుల్ ఆర్ సెంటర్‌కు తరలించాలన్నారు. మంగళవారం, శుక్రవారం రెండు రోజులు పొడి చెత్తను ఇండ్ల నుంచి సేకరించి ఆర్ఆర్ఆర్ సెంటర్‌కు తరలించాలన్నారు. చెత్త సేకరణపై ప్రతి రోజు వార్డు ఆఫీసర్లు, జవానులు పర్యవేక్షణ చేయాలన్నారు. తడి, పొడి చెత్తను ప్రజలు ఇంట్లోనే వేరు చేసేలా చూడాల్సిన బాధ్యత మెప్మా విభాగం తీసుకోవాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్ వేణుమాధవ్, ఎన్విరాన్మెంటల్ ఇంజినీర్ స్వామీ, వార్డు ఆఫీసర్లు, జవానులు, స్వచ్ఛ ఆటోల డ్రైవర్లు, సీవోలు, సమైక్య సంఘాల లీడర్లు పాల్గొన్నారు.

యూజీసీ నూతన ప్రతిపాదనలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

- ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 15: యూజీసీ నూతన ప్రతిపాదనలు ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని, వాటిని విద్యార్థులు వ్యతిరేకించాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠ రెడ్డి పిలుపునిచ్చారు. శనివారం కరీంనగర్ బద్దం ఎల్లారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. యూసీజీ నూతన ప్రతిపాదనలు యూనివర్సిటీలను నిర్వీర్యం చేసేలా ఉన్నాయని తెలిపారు. పూర్తిగా గవర్నర్ చేతిలో వీసీల నియామకాలు పెట్టడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. నూతన యూసీజీ మార్గదర్శకాలను వ్యతిరేకిస్తూ సీఎం రేవంత్ రెడ్డి బీజేపీ వ్యతిరేక రాష్ట్రాల ముఖ్యమంత్రులను ఏకం చేసి, ఉద్యమించాలని డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు ముందస్తు అడ్మిషన్లు చేస్తే చూస్తూ ఊరుకోబోమని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్, నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్, నగర నాయకులు సందీప్ రెడ్డి, అరవింద్, మచ్చ పవన్, శ్రావణ్ తదితరులు పాల్గొన్నారు.

2008 డీఎస్సీ అభ్యర్థులకు పోస్టింగ్స్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 15: జిల్లాలో 2008 డీఎస్సీలో ఎంపికై ఉద్యోగాలు పొందలేని కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులకు శనివారం జిల్లా విద్యాశాఖాధికారి ఒప్పంద ప్రాతిపదికన ఉద్యోగాలు కల్పించారు. ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు జిల్లాలో పది మంది ఉండగా, శనివారం ఎనిమిది మంది అభ్యర్థులు కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. వీరికి పోస్టింగ్‌ను కల్పిస్తూ జిల్లా విద్యాశాఖాధికారి ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, మరో ఇద్దరికి కూడా పోస్టింగ్స్ కేటాయించారు.

సేవ చేస్తా.. ఓటేయండి

మాట్లాడుతున్న నరేందర్ రెడ్డి

తిమ్మాపూర్, ఫిబ్రవరి15: గ్రాడ్యుయేట్స్‌కు ఎన్నో రకాలుగా సేవలందించానని, ఎమ్మెల్సీగా గెలిపిస్తే మరిన్ని సేవలు చేస్తానని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని అలుగునూర్ గ్రామంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో నియోజకవర్గంలోని పట్టభద్రుల సమావేశాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ చేస్తున్న పనులను కార్యకర్తలు, గ్రాడ్యుయేట్లకు వివరిస్తూ తనకు ఓటు వేసేలా చూడాలని కోరారు. తన గెలుపు కోసం కష్టపడాలన్నారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు బత్తిని శ్రీనివాస్ గౌడ్, నాయకులు లక్ష్మీనారాయణ గౌడ్, మోరపల్లి రమణారెడ్డి, నియోజకవర్గంలోని నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థినుల క్షేత్ర పర్యటన

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 15 : జిల్లా కేంద్రంలోని మహిళా డిగ్రీ కళాశాల ఎంఎస్సీ బాటనీ విద్యార్థినులు జగిత్యాల జిల్లా పొలాసలోని వ్యవసాయ పరిశోధన కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు వారికి పలు అంశాలపై అవగాహన కల్పించారు. ఇక్కడ బాటనీ డిపార్ట్‌మెంట్ అధ్యాపకులు, విద్యార్థినులు ఉన్నారు.

కేజీబీవీలో వీడ్కోలు సమావేశం

కేజీబీవీలో వీడ్కోలు సమావేశంలో పాల్గొన్న టెన్త్, ఇంటర్ విద్యార్థినులు

శంకరపట్నం, ఫిబ్రవరి 15: మండల కేంద్రంలోని కేజీబీవీలో టెన్త్, ఇంటర్ మీడియట్ విద్యార్థినుల వీడ్కోలు సమావేశం ఉల్లాసంగా జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రీ ఫైనల్ పరీక్షల్లో టాప్ మార్కులు సాధించిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు. ఇక్కడ ఎస్ఓ మాధవితో పాటు సీఆర్‌టీలు, తదితరులు ఉన్నారు.

కంప్యూటర్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్

రూ.12లక్షల ఆస్తి నష్టం.. మంటలార్పిన ఫైర్ సిబ్బంది

జమ్మికుంట, ఫిబ్రవరి15: పట్టణంలోని జమ్మికుంట-వీణవంక ప్రధాన రహదారిలోని శ్రీకృష్ణ కంప్యూటర్ సెంటర్‌లో షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. బాధితుల కథనం ప్రకారం.. శనివారం సాయంత్రం కంప్యూటర్ సెంటర్ నిర్వాహకులు బిసాడి రాజు, కృష్ణ షాపు మూసి ఇంటికి వెళ్లారు. షాపులో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. స్థానికులు అందించిన సమాచారంతో నిర్వాహకులు ఘటనా స్థలం వద్దకు వచ్చారు. ఫైర్ సిబ్బందికి తెలిపారు. సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు. అప్పటికే కంప్యూటర్లు, వాటికి సంబంధించిన వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. అగ్ని ప్రమాదంలో రూ.12లక్షల ఆస్తి నష్టం వాటిల్లిందని సెంటర్ నిర్వాహకులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉచిత పశువైద్య శిబిరం

మానకొండూర్, ఫిబ్రవరి 15: ఎస్ఎంఎఫ్‌జీ గ్రామశక్తి ఫైనాన్స్ కంపెనీ లిమిటెడ్ ఆధ్వర్యంలో శనివారం మానకొండూర్ పశువైద్యశాలలో పశువైద్య శిబిరం నిర్వహించారు. పశువైద్యాధికారి డాక్టర్ సుస్మితరెడ్డి ఎస్ఎంఎఫ్‌జీ కంపెనీ సమకూర్చిన ఉచిత మందులను పశుపోషకులకు అందజేశారు. కార్యక్రమంలో సిబ్బంది సంధ్య, అనిత, నాగేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలి

మాట్లాడుతున్న వీసీ ఉమేష్ కుమార్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 15 : ప్రతి విద్యార్థి సేవాలాల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని శాతవాహన యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఉమేష్ కుమార్ సూచించారు. శాతవాహన విశ్వవిద్యాలయ ఆర్ట్స్ కళాశాల సెమినార్ హాల్‌లో ఎస్సీ, ఎస్టీ సెల్ బంజారా విద్యార్థులతో కలిసి సంత్ సేవాలాల్ జయంతి వేడుకలు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సూరేపల్లి సుజాత అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ, సేవాలాల్ గిరిజనుడు అయినప్పటికీ ఎంతో జ్ఞానాన్ని పెంచుకొని, వారి జాతి ఔన్నత్యానికి ప్రతీకగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య రవికుమార్, డాక్టర్ రంగ ప్రసాద్, డాక్టర్ హరికాంత్, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

సేవాలాల్‌కు ఘన నివాళి

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 15: సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలు రాంనగర్‌లోని గిరిజన సంఘం కార్యాలయంలో సంఘం ఉపాధ్యక్షుడు బీమాసాహెబ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు పతినాయక్, శ్రావణ్, శివ, దినేష్, రామ్‌చరణ్ పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం

సమావేశమైన పబ్లిక్ ప్రాసిక్యూటర్లు

విద్యానగర్, ఫిబ్రవరి 15: తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ ఆదేశాలపై డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ డి. శరత్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశం శనివారం జిల్లా కోర్టు ఆవరణలో నిర్వహించారు. ఈ సమావేశంలో శరత్ మాట్లాడుతూ, ప్రాసిక్యూటర్లు న్యాయమూర్తులు, న్యాయవాదుల సమన్వయంతో ముందుకెళ్లాలని, కొత్త చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రాసిక్యూటర్ల సమీక్షా సమావేశాలకు విధిగా హాజరు కావాలని తెలిపారు. ఈ సందర్భంగా ప్రాసిక్యూటర్ల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏపీపీ పి. రాకేశ్ పాస్ పోర్ట్ చట్టం గురించి వివరించారు. సమావేశంలో అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (గ్రేడ్ వన్) జ్యోతి రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మల్లికార్జున్, స్పెషల్ పీపీ చీటి రామకృష్ణారావు, అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు లక్ష్మీ ప్రసాద్, జూలూరు శ్రీరాములు, కుమార్ గౌడ్, గౌరు రాజిరెడ్డి, గడ్డం లక్ష్మణ్, పెంట శ్రీనివాస్, ఝాన్సీ, మల్లేశం, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

గీత కార్మికుడికి తీవ్రగాయాలు

శంకరపట్నం, ఫిబ్రవరి 15: కరీంపేట్ గ్రామంలో గుర్రం వీరస్వామి గౌడ్ అనే గీత కార్మికుడు శనివారం ప్రమాదవశాత్తు తాటి చెట్టు పైనుంచి జారి పడగా తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే పక్కనే ఉన్న పలువురు గీత కార్మికులు గమనించి, అపస్మారక స